# 39. పూజారి

"ఈవూరికి కేంప్ వస్తే కబురు చెయ్యమన్నానే గాని; సరాసరి మా ఇంటికే వొచ్చేస్తావని అనుకోలేదు!"

గణపతిరావు చిరునవ్వు మంచి బావుంది. "ఎంతో అవసరం ఉంటే తప్పా నువ్వు నాతో మాట్లాడడానికయినా ప్రయత్నించవు. అందుకే, ఆ గెస్ట్‌హౌస్‌లో కాక ఇక్కడే తీరుబాటుగా మాట్లాడుకోవచ్చుననిపించి ఇలా వచ్చేసేను. నాకు ఇవాళ పదకొండు గంటలకి కలెక్టర్‌తోనూ సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తోనూ ఒక మీటింగుంది. అంటే, ఒక గంటసేపు నాకు ఖాళీ ... ... ఐనా, నేను మీ ఇంటికొచ్చి మాట్లాడకూడదని నువ్వేమీ బోర్డు పెట్టలేదు కదా!"

"గణపతి రావూ!... ... నువ్వూ నేనూ ఒకే కాలేజీలో ఒకే క్లాస్‌లో కలిసి చదువుకున్నాం. హాస్టల్లో కూడా ఒకే రూమ్‌లో వున్నాం. అన్ని పరీక్షలకీ కలిసే వెళ్లేం. పైగా నీ పేరు గణపతిరావు, నాపేరు గోపాలం అవడాన్నించి మనిద్దరికీ పరీక్షల్లో కూడా పక్క పక్క నెంబర్లూ సీట్లూ వచ్చేవి... అప్పటికీ యిప్పటికీ కూడా కులం, ఉద్యోగస్థాయి - లాంటి అబద్ధపు విలవలు అడ్డు రాకుండా నువ్వు మనస్నేహాత్మని పరిరక్షిస్తున్నావు.. ..."

గణపతిరావు చప్పట్లు కొట్టేడు.. " అంటే, ఏదో పెద్దటెండరే పెడతా వన్నమాట?"

"ఏం మాట పొదుపో; చప్పట్లు కొట్టి పిలుస్తున్నారు!...హుఁ!!" అంటూ వొచ్చింది మా ఆవిడ.

"ఆ చప్పట్లు నావికావు... "అన్నాను; అదెవరో గాయకుడు "ఆ దగ్గు నాదే బాబూ!" అన్న ధోరణిలో. "నేనింకేం మాట్లాడక్కర్లేదు... కూర్చో, సత్యా; ఆ తాతాచార్యుల సంగతి గణపతిరావుకి చెబ్దామనుకున్నాం కదా. నాక్కొంచెం మాట సాయంచేసి మరీ వెళ్లు; నీకు పుణ్యాం వుంటుంది-"

మా ఆవిడ కూర్చుంది... "నేను కాకపోతే మీరేమిటి చెప్తారు!? మీరూ మీరూ స్నేహితులు... ఎంత చెట్టుకి అంత గాలి- అన్నట్టుగా ఎంత స్నేహానికి అంత మొహమాటం వుంటుందేమో, " అని; తాతాచార్యులనే అబ్బాయి బాధ తల్లిలా చెప్పడం మొదలెట్టింది.

✤ ✤ ✤

"శతమానం భవతి శతాయుః పురుష శృతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతి తిష్ఠతిః... ... ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!" అని అక్షింతలు నా నెత్తిమీద వేసేడు, ఆ అబ్బాయి. నేను సోఫాలో కూర్చోగానే తను అక్కడే నేలమీద చతికిల పడి రెండు చేతులా నమస్కారం చేసేడు..... "ఇప్పుడే దీవెన; ఇప్పుడే నమస్కారం కూడానా?" అన్నాను. "అది నాలోని పండితుడి వాక్కు. ఇది నాలోని నిరుద్యోగి విన్నపం...." అన్నాడతను; నవ్వకుండా.

✤ ✤ ✤

పావుగంట అయినట్టుంది, ఆ అబ్బాయి వచ్చి. ఉదయం ఏడున్నర దాటిందిగాని ఎనిమిది కాలేదు. ఆదివారం అవడాన్ని ఇంట్లో వున్నాను గానీ మరోనాడు అయితే ఈపాటికి ఆఫీసుకి చేరుదునో సగందారిలో ఉందునో.

బాత్రూమ్ లోకి ప్రవేశించి రెండు నిముషాలు కాకముందే మా అమ్మాయి తలుపు మీది నుంచి వినపడే విధంగా సంభాషణ మొదలెట్టింది.

"నాన్నా ... నీకోసం ఎవరో ఓ అబ్బాయి వచ్చారు."

"ఎవరో అనకపోతే పేరు కనుక్కోవచ్చుగా?"

నా బాత్రూమ్ పని ; ఆయనెవరో ఇంగ్లీషు మీడియంలో చదివిన తెలుగు మేష్టారు చెప్పినట్టు: త్రీ-ఇన్-వన్. అనగా, దంతధావనం, దేహబాధా నివృత్తి, స్నానోత్సవం. అంచేత తిరిగి ఇవతలకి రావడానికి ఖరాగా పదిహేను నిమిషాలు పడుతుంది. ఆదివారం కాబట్టి ఇరవై నిమిషాలు (మరోరెండు సినిమాపాటలు కలుపుకొని) పట్టొచ్చు.

"తాతాచార్యులుట; రాజాం దగ్గిర బొద్దూరు సీతారాంపురంట."

ఎవరో " వెలగలేదు." అయితే కార్యక్రమాలు మానేసి వెంటనే వెళ్ళి ఆహ్వానించే అవసరం లేదు. పావుగంట కూర్చోపెట్టొచ్చు.

"కూర్చోమను."

"కూర్చోమన్నాను. కానీ ఆ అబ్బాయి కూర్చోడట. నువ్వొచ్చే దాకా నిలబడే ఉంటారుట. అందుకే ఇప్పుడు చెప్పాను."

"సరే." అని పైకీ; "అఘోరించమను." అని లోపలా విసుక్కుని నాపనిలోనేను పడ్డాను.

అట్నుంచొస్తూ పూజ గది దగ్గిర ఓక్షణం ఆగి లోపల ఒక్క అడుగు మాత్రం పెట్టి కుంకం భరిణ అందుకొని బొట్టు అయిందనిపించుకొన్నాను.

కుడికాలు ఇవతల పెట్టి దేవుడికి ఓ నమస్కారం పెట్టాను; ఆఫీసరుకి గుడ్ మార్నింగ్ కొట్టినంత సంక్షిప్తంగా. ఎడం వేపునుంచి సణుగుడు: "దేనికేనా టయిముంటుంది కానీ, ఆదివారం పొద్దు కూడా ఆవిగ్రహం ఓ పువ్వు పూజకి నోచుకోదు, పాపం. "

ముందుగదికేసి వేలు చూపించి మళ్ళీ పూజగదిలోకి ఓ నమస్కారం, ఆవిడ మొహం మీదికి ఓ చిరునవ్వూ విసిరి ఇటు తిరిగాను. 'యద్యత్కర్మకరోమి తత్తదఖిలమ్, శంభో, తవారాధనమ్!' అంటూ ఇవతలకి వచ్చి "ఆ అబ్బాయిని" చూశాను.

ఇరవై ఏళ్ళు ఉండవు. పంచె కట్టాడు. ఖండువా వల్లెవాటు వేసుకున్నాడు.తలముందు భాగం సగం వరకు నున్నగా గీసి ఉంది. ఒకే సిందూర తిరుచూర్ణం కనుబొమలనుంచి సిగపాయ వరకూను.

మొహం మాత్రం పావుగంట సేపు నిలుచున్న విసుగు లేకపోగా కాంతిగా ఉంది.

"రండి, కూర్చోండి, ఇప్పుడయినా!" అన్నాను.

ఆ అబ్బాయి కళ్ళు మూసుకున్నాడు. ఋగ్వేదం లోదని నాకు తెలిసిన ఒక పనస అందుకున్నాడు. కుడిచేయి పైకెత్తి వేదోక్తమైన ఆశీర్వచనం అంతా చెప్పి-

సంక్రాంతికి ముందు, ఉగాదికి ముందు కోనసీమనుంచి, దిమిలినుంచి బ్రాహ్మలు ఇలా ఇళ్ళకి వచ్చి ఆశీర్వచనం చెప్పి రూపాయో రెండో పట్టుకెళ్ళడం నాకు సంతోషం దుఃఖం ఒకేసారి కలిగించే సంఘటన. ముఖ్యంగా పేరూరు నుంచి వచ్చే ద్రావిడ బ్రాహ్మలు. "మాది పేరూరే గానీ ఇప్పుడు పేరున్న ఊరుకాదు. పేదూరు అనగా పేద ఊరు." అని చెప్పుకుంటే ఆ జ్ఞానానికి సంతోషించాలో ఆ లేమికి విచారించాలో రెండు రూపాయలిచ్చేసేటంత చప్పున నిర్ణయించుకోలేము.

కానీ ఈ అబ్బాయి అలా రూపాయో రెండో పుచ్చుకుందికి రాలేదని అతను కూర్చున్న తీరు చెప్పింది.

నవ్వేను 'ఆశీర్వచనం చెప్పేరుగా. శక్తి ఉంటే మీకు ఉపకారం చెయ్యగలను. ఇక్కడ కూర్చోండి' అని సోఫామీద నా పక్కచోటు చూపించేను. ఓ కుర్చీ నాఎదటికి లాక్కుని కూర్చున్నాడు.

✤ ✤ ✤

"మిమ్మల్నెక్కడో చూసినట్టుందే?", అన్నాను; అతను మా అమ్మాయి తెచ్చిచ్చిన మజ్జిగ పుచ్చుకొని గ్లాసు అక్కడ పెట్టిన తర్వాత.

"అవునండి. మాదసలు రాజాం దగ్గిర బొద్దూరు సీతారాం పురమండి. నాపేరు పీసపాటి తాతాచార్యులు. రెండేళ్ళకిందట మీ ఫేక్టరీలో ఇంజినీరింగ్ అప్రంటిస్‌గా ఉండేవాడిని. అప్పుడు చూశారు. అంతకంటే ముందు-"

"అవును. మా మనవడు వేణుగోపాలానికి అయిదేళ్ళకిందట మీ ఊళ్ళోనే నామకరణం చేసేం. బావున్నారా?"

ఆ అబ్బాయి తలవెనక వేపు ఉన్న బరిహస్సుమీద కుడిచెయ్యినడిపాడు. "బావుంటే మీదగ్గిరకి ఎందుకొస్తానులెండి. బాగులేను కాబట్టే వచ్చాను. తమరు ఖాళీగా ఉన్నానంటే, ఓపిగ్గా వింటానంటే, మనవి చేస్తాను."

- రెండేళ్ళ క్రిందట ఒక రోజు మా ఫ్యాక్టరీలో నా యూనిట్‌లో ఒక కొత్తరకం యంత్రం ప్రవేశ పెట్టారు. మామూలుగా మా యూనిట్లోకి ఇలాటి యంత్రాలు ఏడాదికి ఒకటి చొప్పున వచ్చి చేరుతూనే ఉంటాయి. అటువంటి సమయాల్లో ఏవెల్డరో ఫిట్టరో ఆయంత్రానికి ఓమూల చిన్న పసుపు బొట్టు పెట్టి, దానికి కొంచెం ఎడంగా (నీళ్లు యంత్రం మీద చిమ్మకుండా జాగ్రత్తపడుతూ) ఒక కొబ్బరికాయకొట్టి యంత్రాన్ని స్విచ్చాన్ చేస్తాడు. కానీ రెండేళ్ళనాడు మా ఫేక్టరీలో ఎం.డి.గా పదిహేను రోజులపాటు ఉండిన కణ్ణదాసన్‌గారు, ఆ యంత్ర ప్రారంభోత్సవం కార్యక్రమం వేదోక్తమైన ఆశీర్వచనంతో వినాయకాది ఆది దేవుళ్ళ పూజలతో తప్ప; జరిపించడానికి వీల్లేదని; ఆ కార్యక్రమానికి, అందుబాటులో ఉన్న పత్రికా విలేఖరులందరూ తమ తమ ఫొటోగ్రాఫర్లతో సహావచ్చి తీరవలసిందేనని, రాతమూలకంగా కాక వేరే విధంగా చెప్పేరు. ఆ సందర్భంగా ఆరోజు పూజకోసం ఓ పురోహితుణ్ణి మాట్లాడి పెట్టమని నా సహోద్యోగి మదన్‌మోహన్ని కోరగా, ఆ పూజాకార్యక్రమంకోసం మార్కెట్లో చెప్పులషాపు దగ్గిర బారులు తీరి కూర్చునే వారినెవరినో పిలవనక్కరలేదనీ, తన యూనిట్లో "అప్రంటిస్"గా పనిచేసే ఓ అబ్బాయి ఈ పనిని సమర్థంగా నిర్వహించగలడనీ చెప్పి ఒక కుఱ్ఱవాడిని నాకు వప్పగించేడు.

అకుఱ్ఱవాడే - ఈ కుఱ్ఱవాడు.

కిందటివారం నాయూనిట్లోకి ముగ్గురు ఇంజినీరింగు అసిస్టెంట్లు కావాలని ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజికి రాశాం. ఒకటి షెడ్యూల్డు తరగతుల వారికి కేటాయించారు. ఒక ఖాళీలో ఆడపిల్లనే వెయ్యాలి. మూడోది ఓపెన్, అంతేకాక, ఇంతకుముందు మాదగ్గిర ఎప్రంటిస్ చేసిన వాళ్ళకి ప్రాధాన్యం.

అంటే ఏమిటి? ఎంప్లాయిమెంటువాళ్ళు ఇతనికి కూడా ఓ కాల్‌లెటర్ వేసి ఉంటారు. 'నాకంటే నిన్ను మా మదన్‌మోహన్‌గారే బాగా ఎరుగును కదా! ఆయన దగ్గిరకే వెళ్ళలేకపోయావా?" అన్నాను;

ఇంతసేపూ అతన్ని మన్నిస్తున్నా నాకు తెలియకుండానే ఏకవచనంలోకి దిగి. "అయినా, నీకొచ్చిన కాల్‌లెటర్ చూపించు, నేనే మదన్ మోహన్‌తో మాట్లాడుతాను." అన్నాను.

తాతాచార్యులు ముడుచుకుపోయాడు. అతని మొహంలో నేనింతసేపూ చూస్తున్న కాంతి ఒక్కసారిగా తగ్గినట్టయింది.

"భగవంతుడి అనుగ్రహం ఆవిధంగా లేదండి. నాకు లెటరయితే వచ్చిందిగానండి అది ఉద్యోగానికి రమ్మన్న పిలుపు కాదండి." ఆమొహంలో చిన్నపాటి వైరాగ్యహాసం. "ఉద్యోగం వదిలి వెళ్ళిపోవలసిందిగా నోటీసండి." అని కేన్వాసు సంచీలోంచి ఒక కవరు తీసి అందులో ఉన్న కాయితం ఊడలాగి నాచేతికి అందించడానికి వీలుగా పట్టుకున్నాడు. నేనుముందుకువంగి ఆ కాగితం అందుకోబోతూ ఉంటే అతను తల అడ్డంగా ఆడిస్తూ "ముందుగా నామనవి వింటారు." అన్నాడు. ఇటువైపు ద్వారంలోంచి ముందుగా వాసన, క్రమంగా, చప్పుడు రెండు ప్లేట్లతో ఉప్మా, మా ఆవిడ.

ప్లేట్లు టీపాయి మీద పెట్టి మా ఆవిడ అతన్ని పలకరించింది. 'మీ అమ్మగారు బావున్నారా? నువ్విలా వస్తావని తెలిస్తే మా మనవడు వేణుగోపాలాన్ని ఇంటికి వెళ్ళిపోనివ్వకుండా ఉంచిద్దును.'

ఆ అబ్బాయి మొహం అంతయింది.

"అమ్మకి గుర్తున్నట్టు అయ్యకి ఉండదండి."

"అదేంటి బాబూ, అలా అంటారు, మా మనవడి నామకరణం నాటికి మీరు పూజారీకాదు ఆశీర్వచనమూ చెయ్యలేదు. అయితే మటుకు, లోహదానాలప్పుడు దేవుడు పంపినట్టు వచ్చి ఉద్ధరణ పుచ్చుకొన్నావు కాదా?"

"రాగి రా కోరుతుందిట కదమ్మా. మీదీవెన వల్ల పూజారిని అయ్యాను. కానీ -" అని నావేపు చూసి ఆగిపోయాడతను.

"ఇప్పుడది వదిలేసి మా ఫేక్టరీలో ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాట్ట." అన్నాను.

మా ఆవిడ వేగంగా మాట్లాడింది. "అదేం, నాయనా! తరాలు తరాలుగా దేవుణ్ణి నమ్ముకోనున్న వారు. మనిషిని నమ్మిన వాడు చెడతాడు కాని దేవుణ్ణి నమ్మినవాడు చెడడు బాబూ... ఆపూజ కంటే ఈ కొలువు గొప్పకాదే !?"

ఆ అబ్బాయి ఆ మాటలకి అడ్డు పడ్డాడు. ముందు కుడిచేత్తో - ఆగండాగండన్నట్టుగా సంజ్ఞచేసి; వెంటనే ఈ చేత్తో ఆలెంప ఆచేత్తో ఈ లెంప మార్చి మార్చి మూడుసార్లు వాయించుకున్నాడు. "అంతపని జరగకూడదనే అయ్యగారి దగ్గిరకొచ్చాను." అని కాగితం నాకివ్వకుండా మా ఆవిడ కిచ్చాడు. ఆవిడ ఆకాగితం అందుకొని చదువుకొంటూ ఉంటే అతను నాతో మాట్లాడుతున్నాడు:

"సీతారామపురం అగ్రహారంలో వెలసిఉన్న వేణుగోపాలస్వామి వారిసేవ మాకు వంశపారం పరంగా వస్తున్న వృత్తి బాబుగారూ... నాకు తెలిసినంతవరకు తొమ్మిది తరాలనాడు, అలనాటి మా పితామహుల, ప్రపితామహుల పితామహులయిన అప్పలాచార్యులవారు వారి మాతామహులయిన నల్లాన్ చక్రవర్తుల రంగనాధాచార్యుల వారినుంచి, వారికి పుత్ర సంతానం లేనికారణంగా ఈ సేవా ధర్మాన్ని స్వీకరించారు. ఈ పరంపరలో ఒకరికిమించి పుత్రసంతానం కలిగినవారు ఒకర్ని ఆలయసేవలో ఉంచి మిగిలినవారిని వేరే వృత్తులకు పంపివేస్తూనే వచ్చారు. నావిషయానికివస్తే;

మా తండ్రిగారికి నేను జ్యేష్ఠ పుత్రుడనయినప్పటికీ; నా తమ్ములిద్దరితోబాటు వేదం, పూజాదికం, అనుష్ఠాన విధానం క్షుణ్ణంగా అభ్యసించి కూడానూ; మాగ్రామానికి సమీపంలో హైస్కూలూ పాలిటెక్నిక్కూ ఏర్పడ్డాన్నుంచి, మెకానికల్ ఇంజినీరింగులో డిప్లమా తీసుకొన్నాను. లోకవృత్తం తెలిసి సమకాలీన పరిజ్ఞానం సంపాదించుకోడంవల్ల మాత్రమే కాకుండా; మీ ఫాక్టరీలో అప్రెంటిస్ చేసి కూడా నా తమ్ముళ్ళిద్దరూ పర్మనెంటు ఉద్యోగాల్లో స్థిరపడ్డంచేత; ఏడాదిక్రితం మా తండ్రిగారు కాలంచేసిన తర్వాత ఆలయంలో నిత్యపూజా అనుష్ఠానాది సేవలు చేపట్టాను"-

"ఇదేంటండీ, ఈ అన్యాయం?" అంటూ, తను చదువుతున్న కాయితం నాకు అందించింది; మా ఆవిడ.

అది హైదరాబాదు నుంచి వచ్చిన ఒక ఆర్డరు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆఫీసునుండి వచ్చింది.

"శ్రీయత పీసపాటి తాతాచార్యులు

వేణుగోపాలస్వామి ఆలయ పూజారి

సీతారామపురం.

ఏడాదికి ఇరవై వేల రూపాయలకు మించిన ఆదాయము కలిగిన ఆలయంలో; పూజారి పదవిలో ఉండవలసిన వారికి; వేద సంబంధమైన "బి- డిప్లొమా" ఉండాలి - అని ఇటీవల ఒక నిబంధన వచ్చియున్నది.

ఈ డిప్లొమా నీకు లేదని తెలిసినది. అంతేకాక, ఈ డిప్లొమాకి సంబంధించిన పరీక్షకి కూడా నీవు ఎన్నడూ కూర్చోలేదని మా దృష్టికి వచ్చినది.

కనుక, నీవు సీతారామపురం వేణుగోపాలస్వామి ఆలయ పూజారిగా ఉండ తగవు. శ్రీ ఎమ్. నరసయ్య అనే దరఖాస్తుదారుడు సదరు పరీక్షలో ఉత్తీర్ణుడై సదరు డిప్లొమా పొందియున్నందువల్ల అతడు ఆ పదవికి అర్హుడై ఉన్నాడు. అంతేకాక, ప్రభుత్వపు విధానాల ప్రకారము కూడా అతడు ఆపదవికి అర్హుడు. అందువల్ల, నీవద్ద ఛార్జి తీసుకొని నిన్ను పదవీ బాధ్యతలనుండి విముక్తుణ్ణి చేయవలసిందిగా అతనికి ఆర్డరు పంపడమైనది."

"అయ్యో!!" అన్నాను, ఆకాగితం అతనికి అందించడానికి జాపి,

అతను ఆ కాగితం పుచ్చుకోలేదు.

"తనురేమీ అనుకోనంటే నామనసులో ఉన్న భావాలు కొద్దిగా మనవి చేస్తాను:

"భారతదేశం కర్మభూమి.

"-ఇక్కడ, తురుష్కుల పాలన చేతను; పాశ్చాత్యులపాలన చేతను నెలకొన్న నాగరికతా సూత్రాలకు అతీతంగా

"ఎవరు ఏ వృత్తిలో కొనసాగితే వారి వంశీయులకున్ను అదే వృత్తి సంక్రమిస్తున్నది.

"సంప్రదాయంగా; కమ్మరి సంతానం కమ్మరి అవుతున్నారు, కుమ్మరి, చాకలి, మంగలి, యాత, ఇలా - పల్లెపట్టున పారం పర్యపు వృత్తులు చేసుకుంటూనే ఉన్నారు.

"- అంతేకాక, రైల్వేలో పనిచేస్తూ ఇటీవలే కాలధర్మం చెందిన మా మేనమామ గారి అబ్బాయికి

రైల్వేలోనే ఒక ఉద్యోగమిచ్చారు.

"-మా వూళ్లో ఉన్న క్షత్రియ కుటుంబానికి చెందిన సూరపరాజుగారు; ఇదే రాష్ట్ర ప్రభుత్వంలో - వాణిజ్య పన్నుల అధికారిగా నిలదొక్కుకున్నారు; వారి కుమారులిద్దరికీ అదే శాఖలో ఉద్యోగాలిప్పించుకున్నారు.....

"అంతెందుకు? ప్రధానమంత్రి కుమార్తె ప్రధానమంత్రి అయింది. మళ్లీ ఆమె కుమారుడు; వద్దు వద్దంటూనే ప్రధానమంత్రి అయినాడు.

"ఫ్యాక్టరీ యజమానుల కుమారులు, కుమార్తెలు కూడా నున్ను; ఫ్యాక్టరీ యజమానులవుతున్నారు.

"సినీ నటుల కుమారులు సినీ నాయకులవుతున్నారు. నటీ మణుల కుమార్తెలున్నూ నటీమణులవుతున్నారు... వీరందరు ఆ వృత్తులకు అవసరమైన పరిజ్ఞానాన్నే సంపాదించుకున్నారు గాని - ఒక్క కాలపరీక్షకు తప్ప - మరి ఏ ఇతర పరీక్షకు కూర్చోడమే లేదు... పారంపర్య వృత్తులకి డిప్లొమాలూ డిగ్రీలూ అంత ముఖ్యం కాదనుకుంటున్నారు.

"ఎవరికి వారు చిత్త శుద్ధితో దేశసేవ చేసినవారు ప్రజాభిమానాన్ని చూరగొని నాయకులుగా రూపుదాల్చవచ్చు. అయినా సరే; ఒక నాయకుడు చనిపోగానే అతని భార్యనో కుమారుడినో కుమార్తెనో కోడలినో ఆహ్వానించి; ప్రజాసేవ బాధ్యతల్ని లాభనష్టాలతో బాటు వప్పగించే సంస్కారం, సానుభూతి, సంప్రదాయంగా వస్తున్నాయి....

"ఇంత విశాలమైన ఈ భారతదేశంలో; ఇదే మనోవైశాల్యంతో నన్ను కూడా ఆదరించరాదా?... ఆదరించరా?...

"తొమ్మిది తరాల నుండి సీతారామపురం వేణుగోపాలస్వామి కొలువు చేసిన మా పూర్వులలో అందరికీ చిత్తశుద్ధీ, డొక్కశుద్ధీ మాత్రమే అవసర మయ్యాయి. నావరకూ వచ్చేసరికి 'డిప్లొమా' బాధ ఒకటి సిద్ధమైంది..."

✣ ✣ ✣

"సామర్ధ్యం లేని ప్రేమ రాణించదు, గోపాలం!" అన్నాడు గణపతిరావు. నువ్వు అతని బాధంతా విన్నావు. మా గణపతిరావు దేవదాయ ధర్మాదాయ శాఖలో కమిషనర్ గానూ సెక్రెటరీ ఇన్‌ఛార్జ్‌గానూ ఉన్నాడు కదా, అతనితో చెప్తే ఈ తాతాచార్యులుకి ఉపకారం జరుగుతుందనే ఆలోచనైతే నీకు కలిగింది గానీ-... నువ్వు ఒకసారి బయల్దేరి హైద్రాబాదు రానూలేదు; కనీసం ఓ ట్రంకాల్ బుక్‌చేసి నాతో మాట్లాడే వయినా కాదు!"

నేను నిర్ఘాంతపోయాను. గణపతిరావు అంత ఉన్నతాధికారి అయివుండీ కూడా, తాతాచార్యుల కేసులోని సహజమైన న్యాయాన్ని గ్రహించాడని తోచింది. "నేను వేసిన ఆర్డర్ లోనే తప్పు ఎంచుతావా? నాపరిపాలనలో జోక్యం చేసుకోడానికి నీకెన్ని గుండెలు!" - అనడం లేదు, గణపతిరావు. తాతాచార్యుల కొచ్చిన ఉత్తరం కాపీ అయినా తీసుకోకపోతిని; ఈ లోగానే కొంప మునిగిపోయిందో, ఏమిటో?!.

"ఆలస్యంగా అందించే న్యాయం అన్యాయంతో సమానం!" అన్నాడు, గణపతిరావు. "వ్యవహారాలు చక్కదిద్దడానికి అవసరమైన చురుకుతనం నీలోలేదు. నిన్నొక్కణ్ణీ నమ్ముకొని కూచుంటే ఆ తాతాచార్యులు రోడ్డున పడుండే వాడే... ... ఎనీ వే; ఆ తరవాత తాతాచార్యులొచ్చి

నీకు కనిపించ లేదన్నమాటేగా!?''

"అంటే?''

"... ... ఓ కే... ఫాలో అప్ లేదు కనక నీ కేమీ తెలీదు... ... ఆ అబ్బాయి నీదగ్గిర్నుంచి తిన్నగా వాళ్ళ వూరి మోతుబరి బిడ్డ లక్షిన్నాయుడు దగ్గిరి కెళ్లేడు. అతనీ వూళ్లోనే ఉన్నాడు. చాలా సమర్థుడైన న్యాయవాది. నరసయ్య ఎపాయింట్‌మెంట్ మీద "స్టే'' తెచ్చేడు. సంగతంతా పూర్తిగా పరిశీలించి; ఆలయపూజారిగా ఉన్న తాతాచార్యులకి డిప్లొమాలో చెప్పిన జ్ఞానం ఉందోలేదో చూడమని ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని వెయ్యమంది హైకోర్టు... ... రిపోర్టు కూడా వొచ్చేసింది.. ... తాతాచార్యులకి డిప్లొమా లేకపోతే పోయింది గాని, శ్రీ సూక్తం, పురుషసూక్తం, సహస్రనామం, అర్చన, సంకల్పం, సంహిత, మంత్రపుష్పం, హారతి, ఆశీర్వచనం - లాంటి నిత్యావసర కర్మానుష్ఠాన నిర్వహణలకి తగినంత సామర్థ్యం, అనుభవం ఉన్నాయి. వేదం, మంత్రం ప్రవచించేటప్పుడు పాటించవలసిన ఉదాత్త- అనుదాత్త-స్వరాల తారతమ్యం అతనికి గళగ్రాహ్యం...''

"అమ్మయ్య!... ...'' అన్నాను." ఐతే, తాతాచార్యులకి-''

'ఈ పూజారి వరమిచ్చేడు!' అని నవ్వుతూ తన గుండె మీద వేలుపెట్టుకుని లేచాడు గణపతిరావు. 'అతను రెండేళ్లలోగా డిప్లొమా పరీక్షకి కూర్చుని పాసవ్వాలని హెచ్చరించేరు, శ్రీవారు'

*(" సుప్రభాతం " పక్షపత్రిక : [illegible]-6-97 )*